

వరంగల్ జిల్లా నర్సంపేట మార్కెట్‌లో భారీ వర్షంతో తడిసిపోతున్న ధాన్యం



కామారెడ్డి జిల్లా కేంద్రంలోని గంజ్ మార్కెట్‌లో తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతులు

## లోకం పోకడ




మన అందాల భామలే సార్... కరోనాకు భయపడి..!

# తడిసిన ధాన్యం... అన్నదాత ఆగం

- రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం
- రైతుకు శాపంగా మారిన రాష్ట్ర సర్కారు నిర్లక్ష్యం
- 130 లక్షల టన్నుల దిగుబడికి కొన్నది 56 లక్షల టన్నులే
- ఆరుగాలం కష్టం నీళ్ల పాలు.. లబోదిబోమంటున్న అన్నదాతలు

హైదరాబాద్, మే 21(నమస్తే తెలంగాణ): సర్కా రు నిర్లక్ష్యం రైతుల కొంపముంచుతున్నది. ఆరుగాలం కష్టం నీళ్లపాలవుతున్నది. కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం తడిసిముద్దవుతున్నది. కొన్ని చోట్ల రైతుల కండ్ల ముందే వరదలో కొట్టుకుపోతున్నది. దీంతో రైతాంగం లబోదిబోమంటున్నది. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ చూసినా రైతన్న కన్నీటి వేదనే కనిపిస్తున్నది.

**వరదలో ధాన్యం..**

గడిచిన 20 రోజులుగా అకాల వర్షాలు, వడగండ్ల వానలు రైతాంగాన్ని ఇబ్బంది పెడుతున్నాయి. వర్షాలపై వాతావరణ శాఖ హెచ్చరికలను సివిల్‌సప్లై అధికారులు పట్టించుకోకపోగా, ధాన్యాన్ని కాపాడేందుకు కనీస చర్యలు చేపట్టలేదు. వర్షాలు కురిస్తే ధాన్యం తడిసిపోయి నష్టం వస్తుందని తెలిసినా నింపాదిగా ధాన్యం కొనుగోళ్లు చేశారంటూ రైతులు ఆరోపిస్తున్నారు. కనీసం ధాన్యంపై కప్పేందుకు టార్పాలిన్లు కూడా అందుబాటులో లేకపోవడం గమనార్హం. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కొనుగోలు కేంద్రాలు చెరువులను తలపిస్తున్నాయి. ధాన్యం వరదలో కొట్టుకుపోతుంటే.. వాటిని కాపాడుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

| | |
|---|---|
| ఈ సీజన్‌లో ధాన్యం ఉత్పత్తి అంచనా: | 130 లక్షల టన్నులు |
| ఇప్పటి వరకు కొన్న ధాన్యం: | 55.97 లక్షల టన్నులు |
| కొనుగోలు చేసిన ధాన్యం విలువ: | రూ. 12,974.10 కోట్లు |
| రైతులకు చెల్లించిన మొత్తం: | రూ. 9632.66 కోట్లు |
| ఇంకా చెల్లించాల్సిన మొత్తం: | రూ. 3341.44 కోట్లు |
| సన్న ధాన్యం బోనస్ కింద చెల్లించాల్సిన మొత్తం: | రూ. 923 కోట్లు |
| రైతులకు చెల్లించిన బోనస్: | 0 |

**130 లక్షల టన్నుల ఉత్పత్తి.. కొన్నది 56 లక్షలే**

ధాన్యం కొనుగోళ్లలో సర్కారు నిర్లక్ష్యానికి ధాన్యం కొనుగోళ్ల లెక్కలే ఉదాహరణగా నిలుస్తున్నాయి. లక్ష్యం కొండంత ఉండగా కొన్నది మాత్రం కొసరంత ఉన్నది. ఈ యాసంగిలో 60.14 లక్షల ఎకరాల్లో వరి సాగైందని, 130 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నట్టు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్వయంగా వెల్లడించారు. ఈ నెల 19వ తేదీ వరకు కేవలం 55.97 లక్షల టన్నులు మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేసింది. అంటే మొత్తం ధాన్యంలో ఇది సగం మాత్రమే. మార్చి 20వ తేదీ నుంచి కొనుగోళ్లు ప్రారంభించినట్టు చెప్పిన సివిల్ సప్లై అధికారులు రెండు నెలలు గడుస్తున్నా సగం కూడా కొనలేదు.

**నెల రోజులైనా కేంద్రాల్లోనే ధాన్యం..**

అకాల వర్షాల అంచనా నేపథ్యంలో ధాన్యం కొనుగోలు చేయండంటూ రైతులు కోరినా అధికారులు కాంట పెట్టలేదు. నెలల పాటు కొనుగోలు కేంద్రాల్లోనే మూలిగిన ధాన్యం చివరికి వర్షార్పణం అవుతున్నది. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ సంచులు, లారీలు, వేయింగ్ మిషన్లు, తేమ చూసేందుకు మాయిశ్చర్ మీటర్లు అందుబాటులో లేకపోవడం కూడా కొనుగోళ్ల ఆలస్యానికి కారణంగా తెలుస్తున్నది. మరోవైపు కొర్రీలు పెడుతూ ధాన్యం కొనకపోవడంతో రైతాంగం కొనుగోలు కేంద్రాల వద్దే పడిగాపులు కాయాల్సి వచ్చింది. సన్న ధాన్యానికి రూ. 500 బోనస్ ప్రకటించిన ప్రభుత్వం.. చెల్లింపులో మాత్రం జాప్యం చేస్తున్నది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 2.87 లక్షల మంది రైతుల నుంచి 18.47 లక్షల టన్నుల సన్న ధాన్యం సేకరించింది. ఇందుకు గానూ రైతులకు బోనస్ కింద రూ. 923.40 కోట్లు చెల్లించాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు రైతులకు ఒక్కటంటే ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడం గమనార్హం.

## ధాన్యం తడవకుండా ఏర్పాట్లు చేయండి

- భారీ వర్షాల నేపథ్యంలో అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

హైదరాబాద్, మే 21 (నమస్తేతెలంగాణ): రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మార్కెట్లలో ఉన్న ధాన్యం తడవకుండా తగిన చర్యలు చేపట్టాలని, కాంటా వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో వర్షం కురుస్తున్న ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిల్వకుండా చూడాలని, ట్రాఫిక్ ఇబ్బందులు, విద్యుత్తు సమస్యలు లేకుండా చూడాలని ఆదేశించారు.

**ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధం**

భారీ వర్షాలు కురిసే అవకాశమున్న నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో జిల్లాలకు ముందస్తు చర్యలపై రాష్ట్ర ప్రభుత్వ విపత్తుల నిర్వహణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్ మార్గదర్శకాలను విడుదల చేశారు వర్షాల నేపథ్యంలో ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్టు తెలిపారు. అగ్నిమాపక శాఖ సిబ్బందికి కూడా అవసరమైన శిక్షణనందించి అందుబాటులో ఉంచినట్టు తెలిపారు.

## వర్షబీభత్సం

- కొనుగోలు కేంద్రాల్లోనే తడిసిన ధాన్యం
- పిడుగుపాటుకు ముగ్గురి మృతి

నమస్తే నెట్‌వర్క్: రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీవర్షం కురిసింది. దీంతో ఆయా చోట్ల పలు కాలనీలు జలమయమయ్యాయి. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దయ్యింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం వన్‌పల్లి, ఇల్లంతకుంట మండలం పొత్తూరు, ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్, కోనరావుపేట మండలంలోని నిజామాబాద్, రుద్రంగి మండలకేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ధాన్యం కుప్పలు తడిశాయి. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో పోసిన వరిధాన్యం పూర్తిగా తడిసిపోయింది. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని గంజ్ మార్కెట్‌లో ఆరబోసిన ధాన్యం వర్షానికి పూర్తిగా తడిసింది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో రోడ్లపైనే మురుగు, వరద పారడంతో వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. నగర పాలక సంస్థ కార్యాలయంలోనే వరద గంటపాటు నిలిచిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. షాషాబ్‌గుట్టలో నీటి ప్రవాహం, కాల్వల పరిస్థితిని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, అధికారులతో కలిసి కలెక్టర్ విజయేంద్రబోయి పరిశీలించారు. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం అనంతారంలో, ఆత్మకూర్.ఎస్ మండలంలో ఏపూరులో వర్షానికి కొనుగోలు కేంద్రంలోని ధాన్యం తడిసి ముద్దయ్యింది. నల్లగొండ మండలం అప్పాజీపేట పరిధిలోని బంటుగూడెం గ్రామంలో పిడుగుపాటుకు మహిళా రైతు మృతిచెందింది. పెదఅడిశర్లపల్లి మండలంలోని పెద్దగట్టు గ్రామంలో రెండు ఆవులు మృతి చెందగా మరో ఇద్దరు స్పృహ తప్పి కింద పడిపోయారు. మహబూబాబాద్ జిల్లా పెదవంగర మండలం బొమ్మకల్లు, దంతాలపల్లి మండల కేంద్రంతో పాటు వేములపల్లి, పెద్దముప్పారం, రేపోణి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి నీటిపాలైంది. వరంగల్ జిల్లా నర్సంపేటలోని వ్యవసాయ మార్కెట్ వరద నీటితో చెరువులా మారింది. నెక్కొండ మార్కెట్ యార్డులో ఆరబోసిన ధాన్యం నీటిపాలైం ది. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గుండెంగలో పిడుగుపాటుకు మైదం ప్రవీణ్(30), కొత్తగూడ మండలం ఓటాయికి చెందిన గొర్రెల కాపరి ఏశబోయిన చేరాలు(60) పిడుగుపడి మృతి చెందారు. ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షంతో అపార నష్టం వాటిల్లింది.

## ఎండా కాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 41.3°c | 27.7°c |
| నిజామాబాద్ | 39.0°c | 21.8°c |
| రంగారెడ్డి | 37.6°c | 23.6°c |
| హైదరాబాద్ | 36.5°c | 26.5°c |
| నల్లగొండ | 36.0°c | 23.0°c |
| ఖమ్మం | 35.0°c | 25.0°c |
| వరంగల్ | 35.0°c | 24.0°c |
| కరీంనగర్ | 32.0°c | 26.0°c |
| మహబూబ్‌నగర్ | 32.0°c | 25.0°c |
| మెదక్ | 29.9°c | 25.0°c |

## ఐదు రోజుల పాటు వర్షాలు

- ఆశాజనకంగా నైరుతి: వాతావరణ శాఖ

హైదరాబాద్, మే 21 (నమస్తేతెలంగాణ): నైరుతి రుతుపవనాల కదలిక ఆశాజనకంగా ఉంది. మరోవైపు ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో మరో ఐదు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశమున్నదని వాతావరణ శాఖ తెలిపింది. ద్రోణి ప్రభావంతో బుధవారం నిజామాబాద్, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబగద్వాల జిల్లాల్లో బుధవారం వర్షం కురిసినట్టు తెలిపారు. రానున్న ఐదు రోజుల పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశమున్నదని, ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా గత 24 గంటల్లో కామారెడ్డి జిల్లా సదాశివపేట మండలంలో అత్యధికంగా 8.64 సెం.మీ వర్షపాతం నమోదైంది.

## విద్యుత్తు షాక్‌తో రైతు మృతి

రామారెడ్డి, మే 21: విద్యుత్తు షాక్‌తో రైతు మృతిచెందిన ఘటన కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం ఘన్‌పూర్(ఆర్) లో చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన భూక్యా రాజు(35) బుధవారం ఉదయం తన పొలంలో గెట్లపై ఉన్న మొక్కలను గొడ్డలితో తొలగిస్తున్నాడు. ఈ క్రమంలో బోరుబావికి విద్యుత్ సరఫరా అవుతున్న సర్వీస్ వైరు ప్రమాదవశాత్తు గొడ్డలికి తగిలి, అతడి చేతిపై పడింది. దీంతో రాజుకు షాక్ తగిలి తీవ్ర గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు వెంటనే కుటుంబీకులకు సమాచారం ఇచ్చి, కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వైద్యులు అతడు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతుడి భార్య వనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నామని ప్రొబేషనరీ ఎస్సై నవీన్‌చంద్ర తెలిపారు. .

## ధాన్యం కాంటా వేయాలని రైతు ఆత్మహత్యాయత్నం

తుంగతుర్తి, మే 21: కొనుగోలు కేంద్రంలో ధాన్యం పోసి నెల దాటుతున్నా, కాంటా వేయకపోవడంతో విసుగెత్తిన ఓ రైతు ఆత్మహత్యాయత్నం చేశాడు. తోటి రైతులు గమనించి పెట్రోల్ బాటిల్ లాక్కోవడంతో ప్రమాదం తప్పింది. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలంఅన్నారం గ్రామానికి చెందిన రైతు ఉప్పల వెంకన్న ఐకేపీ కేంద్రంలో ధాన్యం పోశాడు. 30 రోజులు దాటుతున్నా ఐకేపీ సెంటర్ నిర్వాహకులు ధాన్యం కాంటా వేయలేదు. వానలు పడినప్పుడల్లా తిరిగి ఆరబెట్టాల్సి వస్తున్నది. దీంతో రైతు వెంకన్న ధాన్యం రాశి వద్దే పెట్రోల్ మీద పోసుకొని అంటించుకునే ప్రయత్నం చేశాడు. పక్కనున్న రైతులు గమనించి పెట్రోల్ బాటిల్ లాక్కొని నచ్చజెప్పడంతో ప్రమాదం తప్పింది.

## కేసీఆర్ పాలన.. తెలంగాణ అగ్రభాగాన

- స్టేట్ ఎకనామిక్ ట్రెండ్స్-మే నివేదిక వెల్లడి
- మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, మే 21 (నమస్తే తెలంగాణ): తొమ్మిదేండ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రం ఆర్థికరంగంలో అసాధారణ విజయం సాధించిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు గుర్తుచేశారు. 2015లో తలసరి పర్ క్యాపిటా గ్రాస్ స్టేట్ వాల్యూ యాడెడ్ (జీఎస్‌వీఏ)లో 9వ స్థానంలో ఉన్న తెలంగాణ.. 2024 నాటికి దేశంలోనే అగ్రస్థానానికి చేరిందని తెలిపారు. ఈ విషయాన్ని తాజాగా ఐసీఆర్ఏ 'స్టేట్ ఎకనామిక్ ట్రెండ్స్-మే 202 5' నివేదిక వెల్లడించిందని పేర్కొన్నారు. ఈ నివేదికను బుధవారం ఎక్స్‌లో పోస్టు చేశారు. తలసరి ఆదాయం రూ.1.25 లక్షల నుంచి రూ.3.5 లక్షలకు రెట్టింపయ్యిందని తెలిపారు. ఈ విజయం వెనుక కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులు, వ్యవసాయ విధానాలు, పారిశ్రామిక వృద్ధి ఉన్నదని వివరించారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని దివాలా రాష్ట్రంగా చిత్రీకరిస్తూ వస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'వాస్తవంగా ది వాలా అయింది ఆర్థిక వ్యవస్థ కాదు. ఆయన ఆలోచనలే. ఈ నిరూపిత విజయాలను విస్మరించి, బీఆర్ఎస్ వేసిన బలమైన పునాదిని కొనసాగించకపోవడం అంటే ప్రజలను తప్పుదారి పట్టించడమే కాదు, తెలంగాణ ప్రగతిని అవమానించడమే. ఈ ఆర్థిక విజయం దేశానికి స్ఫూర్తిగా నిలుస్తుంది' అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# కేసీఆర్ పాలనలో తెలంగాణకు వాల్యూ

మొదటిపేజీ తరువాయి...

గణాంకాలతో కుండబద్దలు కొట్టింది. తెలంగాణ రాష్ట్రం ఆర్థికాభివృద్ధిలో దూసుకుపోతున్నదని, తలసరి జీఎస్‌వీఏలో దేశంలోనే ఫస్ట్ ప్లేస్‌లో ఉన్నట్టు ఐసీఆర్ఏ (ఇన్వెస్ట్‌మెంట్ ఇన్ఫర్మేషన్ అండ్ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ) సంస్థ తేల్చిచెప్పింది. ఈ మేరకు 2014-15 నుంచి 2023-24 వరకు 'స్టేట్ ఎకనమిక్ ట్రెండ్స్ మే-2025' పేరిట నివేదికను విడుదల చేసింది.

**జీఎస్‌వీఏలో రాకెట్ వేగం**

సంపదను సృష్టించడమే కాదు దాన్ని రెట్టింపు చేయడం ఎలాగో బీఆర్ఎస్ సర్కారు చేసి చూపించింది. రాష్ట్ర సత్తాను దేశానికి చాటిచెప్పింది. కొత్తగా ఏర్పడిన ఓ రాష్ట్రానికి దశాదిశను చూపించడమే కాకుండా అభివృద్ధి అంటే ఏమిటో రాష్ట్రాలకు కండ్లకు కట్టినట్టు చూపించింది. ఒక రాష్ట్ర అభివృద్ధికి కొలమానాలు అంకెలే. తలసరి ఆదాయం, జీఎస్డీపీ పెరుగుదలను పరిశీలిస్తే ఆ రాష్ట్రం ఎంత అభివృద్ధి చెందిందో అంచనా వేయవచ్చు. తెలంగాణ కూడా ఆ ఆర్థికాభివృద్ధిని అనతి కాలంలోనే సాధించింది. కేసీఆర్ పదేండ్ల పాలనలో ఇది సాకారమైంది. 2014లో కేసీఆర్ సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పుడు 2014-15లో తలసరి జీఎస్‌వీఏలో రాష్ట్రం 9వ స్థానంలో ఉంది. 2023-24నాటికి దేశంలోనే మొదటి స్థానానికి చేరింది. 2014-15లో తెలంగాణ తలసరి జీఎస్‌వీఏ రూ. 1.25 లక్షలుగా (ప్రస్తుత ధరల్లో) ఉండగా, 2023-24 నాటికి ఇది రెట్టింపు కంటే ఎక్కువగా పెరిగి రూ.3.5 లక్షలకు (ప్రస్తుత ధరల్లో) చేరింది. ఇదే సమయంలో తెలంగాణ సమ్మిళిత వార్షిక వృద్ధిరేటు (కాంపౌండ్ యాన్యువల్ గ్రోత్‌రేట్-సీఏజీఆర్) 6.8 శాతంగా నమోదైంది. ఇది జాతీయ సగటు 5.8 శాతం కంటే ఎక్కువ అని ఐసీఆర్ఏ నివేదిక వివరించింది.



### ఏమిటీ తలసరి జీఎస్‌వీఏ?

జీఎస్‌వీఏను సాంకేతికంగా రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో జతచేరిన అదనపు విలువ (గ్రాస్ స్టేట్ వ్యాల్యూయాడెడ్)గా పిలుస్తారు. వ్యవసాయం, పరిశ్రమలు, సేవలు తదితర రంగాలు ఉత్పత్తి చేసే విలువనే జీఎస్డీపీగా తీసుకొంటాం. రాష్ట్రంలోని ఒక్కో పౌరుడు పనిచేస్తేనే జీఎస్డీపీలో వృద్ధిరేటు సాధ్యపడుతుంది. స్థూలంగా చెప్పాలంటే ఒక్కో పౌరుడి ఉత్పాదకత విలువను తలసరి జీఎస్‌వీఏగా పరిగణించవచ్చు. ఒకవిధంగా పౌరుడి ఆదాయమే తలసరి జీఎస్‌వీఏగా చెప్పొచ్చు.

**సాగురంగంలో కొత్త శిఖరాలకు**

బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ వ్యవసాయ రంగం రూపురేఖలే మారిపోయాయని ఐసీఆర్ఏ నివేదిక కొనియాడింది. కేసీఆర్ పాలనలో వ్యవసాయరంగంలో తెలంగాణ సమ్మిళిత వార్షిక వృద్ధిరేటు 6.2 శాతంగా నమోదైనట్టు వెల్లడించింది. ధాన్యం దిగుబడిలో చాలా రాష్ట్రాలను అధిగమించిన తెలంగాణ సాగులో 6 శాతం సమ్మిళిత వార్షిక వృద్ధిరేటును నమోదు చేసింది. దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని నివేదిక వివరించింది. తెలంగాణలో సాగురంగం విస్తరించడానికి నీటి పారుదల వసతులు పెరగడమే కారణమని నివేదిక పేర్కొంది. 2014-15తో పోల్చితే 2023-24 నాటికి నీటిపారుదల విస్తరణ 26 శాతం మేర పెరిగినట్టు తెలిపింది. మూలధన వ్యయంలో 30-50 శాతం మేర వ్యయాన్ని నీటి పారుదల రంగానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించినట్టు వివరించింది. కాళేశ్వరం వంటి ప్రాజెక్టుల వల్లే రాష్ట్రం సస్యశ్యామలంగా మారిందని నిపుణులు చెప్తున్నారు.

**పారిశ్రామిక ప్రగతి పథం**

కేసీఆర్ పాలనలో వ్యవసాయ రంగంతో పాటు పారిశ్రామిక రంగంలోనూ తెలంగాణ కొత్త రికార్డులను సృష్టించినట్టు ఐసీఆర్ఏ నివేదిక తెలిపింది. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో పారిశ్రామిక రంగంలో తెలంగాణ సమ్మిళిత వార్షిక వృద్ధిరేటు 6-7 శాతంగా నమోదైనట్టు నివేదిక వెల్లడించింది. జాతీయ సగటు 5.7 శాతం కంటే ఇది ఎక్కువ అని వెల్లడించింది. సేవల రంగంలోనూ తెలంగాణ సమ్మిళిత వార్షిక వృద్ధిరేటు 6.5-6.9 శాతంగా నమోదైనట్టు నివేదిక వెల్లడించింది. ఈ విషయంలోనూ జాతీయ సగటు కంటే తెలంగాణ చాలా ముందున్నట్టు వివరించింది. వాణిజ్య విభాగంలో 9 శాతం, రియల్‌ఎస్టేట్ రంగంలో 8 శాతం, రవాణా రంగంలో 7 శాతం వృద్ధితో తెలంగాణ దేశంలోనే టాప్ ప్లేస్‌లో ఉన్నట్టు నివేదిక వెల్లడించింది.

**ఆ నివేదికల్లోనూ ఇదే తేలింది**

జీఎస్‌వీఏలో తెలంగాణ టాప్ ప్లేస్‌లో ఉన్నట్టు ఐసీఆర్ఏ నివేదికతో పాటు ఆర్థిక సర్వే 2024-25 నివేదిక కూడా ఇదే విషయాన్ని వెల్లడించింది. 2022-2023 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ జీఎస్‌వీఏలో సేవారంగం వాటా 60 శాతానికి పైగా నమోదైనట్టు తెలిపింది. సర్వీసు రంగంలో దేశంలోనే తెలంగాణ రెండో స్థానంలో నిలిచినట్టు ఆర్థిక సర్వే 2024-25 నివేదిక వెల్లడించింది. పదేండ్లలో తెలంగాణలో ముఖ్యంగా హైదరాబాద్‌లో ఐటీ సేవల్లో వచ్చిన విప్లవాత్మకమైన మార్పులు, రియల్ ఎస్టేట్ రంగంలో వృద్ధి.. సేవారంగం విస్తరించడానికి దోహదపడ్డాయని నివేదిక అభిప్రాయపడింది. హైదరాబాద్‌లో కార్యాలయ, నివాస స్థలాలకు మంచి గిరాకీ ఏర్పడినట్టు వివరించింది. ఆర్థిక ప్రగతికి కీలకమైన జీఎస్డీపీ, తలసరి ఆదాయం, విద్యుత్తు, పంటల సాగు, అటవీ విస్తీర్ణంతో పాటు పలు అంశాల్లో కేసీఆర్ హయాంలో తెలంగాణ రికార్డులు సృష్టించిందని ఆర్బీఐ హ్యాండ్ బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్-2024 నివేదిక స్పష్టంచేసింది.

**16 నెలల్లో అంతా అస్తవ్యస్తం**

2014లో రాష్ట్రంగా ఆవిర్భవించిన ఉన్న సమస్యలను తొలి సీఎం కేసీఆర్ పరిష్కరిస్తూ 2024 నాటికి రాష్ట్రాన్ని అగ్రపథాన నిలిపారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ బంగారమయమైంది. ఆర్బీఐ నివేదిక అయినా, ఆర్థిక సర్వే, ఎంఎస్ఎంఈ కౌన్సిల్ ని వేదికలైనా ప్రస్తుత ఐసీఆర్ఏ నివేదిక అయినా ఇదే విషయాన్ని స్పష్టంచేస్తున్నది. కానీ రేవంత్‌రెడ్డి ఏడాదిన్నర పాలనలో పచ్చని తెలంగాణ అస్తవ్యస్తంగా మారిపోయింది. జీఎస్డీపీ వృద్ధిరేటు గతంతో పోలిస్తే, 0.94 శాతం మేర పడిపోయింది. తలసరి ఆదాయం వృద్ధిరేటు గతంతో పోలిస్తే 4.5 శాతం తక్కువగా రికార్డయింది. జీఎస్టీ వసూళ్లు, రవాణా రాబడి కూ డా పడిపోయింది. ఈ మేరకు గత నెలలో విడుదలై న కేంద్ర ప్రభుత్వ ఎంవోఎస్‌పీఐ నివేదికతో స్పష్టమవుతున్నది.

# సీజన్ వచ్చినా విత్తనాలేవి?

- పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ ఏదీ?
- కాంగ్రెస్ పాలనలో రైతులకు అరిగోస
- అన్నదాతలకు ఇంకా అందని రైతు భరోసా
- ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం
- మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపాటు

జహీరాబాద్, మే 21 : కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర రైతుల పరిస్థితి దారుణంగా తయారైందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆవేదన వ్యక్తంచేశారు. వానకాలం సీజన్ ప్రారంభమైనా రైతులకు జీలుగ, జనుము విత్తనాలు, ఎరువులను ప్రభుత్వం అందుబాటులో ఉంచలేదని చెప్పారు. బుధవారం సాయంత్రం జహీరాబాద్ నియోజకవర్గంలోని మొగుడంపల్లి మండలం జాడి మల్కాపూర్‌లో దుర్గాదేవి జాతరకు హరీశ్ వచ్చారు. అనంతరం జహీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియా తో



జహీరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో రైతులకు ఎరువులు, విత్తనాలను ముందుగానే అందించామని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మద్యం ధరలతో పాటు జీలుగ, జనుము విత్తనాల ధరలను కూడా పెంచిందని, సీజన్‌కు విత్తనాలను అందుబాటులో ఉంచకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదని వాపోయారు. ఉమ్మడి మెదక్ జిల్లాను నేషనల్ సీడ్ కార్పొరేషన్‌కు అప్పజెప్పినా కేంద్రం విత్తనాలు ఇవ్వడం లేదని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి విత్తనాలు ఇవ్వకుండా రైతులకు అన్యాయం చేశాయని ఆగ్రహం వ్యక్తంచేశారు.

**వానలకు తడుస్తున్నా వడ్లు కొనరా?**

రాష్ట్రంలో కొనుగోళ్లు సరిగా సాగక రైతులు నష్టపోతున్నారని, వర్షాలకు వడ్లు తడిసినా ప్రభుత్వం కొనుగోలు చేయకుండా చోద్యం చూస్తున్నదని హరీశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్ర మంత్రులు, అధికారులు కొనుగోలు కేంద్రాలను సందర్శించిన దాఖలాల్లేవని విమర్శించారు. తరుగు పేరిట రైతులను నిలువునా దోచుకుంటున్నారని మండిపడ్డారు. సన్నవడ్లకు బోనస్ చెల్లిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం బోగస్ చేసిందని ఫైర్ అయ్యారు. రూ.850 కోట్ల బోనస్‌లో రైతులకు రూపాయి కూడా ఇవ్వలేదని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ హయాంలో అమలైన రైతు సంక్షేమ పథకాలను ఈ ప్రభుత్వం పూర్తిగా నిలిపివేసిందని మండిపడ్డారు. రైతుబీమా పథకానికి ఫిబ్రవరిలో చెల్లించాల్సిన ప్రీమియం చెల్లించక పోవడంతో రైతు కుటుంబాలకు అన్యాయం జరుగుతున్నదని వాపోయారు.

**పంట నష్ట పరిహారం చెల్లించాలి**

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో పంటల బీమా పథకాన్ని ప్రవేశ పెడతామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పిన మాట నేటికీ అమలు కావడం లేదని హరీశ్ విమర్శించారు. నిరుడితో పాటు ఈసారి జరిగిన పంట నష్టానికి సంబంధించి వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. 48 గంటల్లో జొన్న డబ్బు చెల్లిస్తామని మంత్రి ఉత్తమ్ చెప్పారని, 48 రోజులైనా చెల్లించేదని ఎద్దేవాచేశారు. ఈనెల 23న జహీరాబాద్‌కు పర్యటనకు సీఎం రేవంత్ ఏముఖం పెట్టుకొని వస్తున్నారని ప్రశ్నించారు. జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, మాణిక్యం పాల్గొన్నారు.

## ధాన్యం తరలించాలి



ధాన్యం తరలించాలని డిమాండ్ చేస్తూ రైతులు ఆందోళనకు దిగారు. మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని రంగంపేట పీఏసీఎస్ పరిధిలోని పైతర కోనాపూర్, వై.మాందాపూర్ రైతులు బుధవారం రంగంపేట సొసైటీ ఎదుట మెదక్-సంగారెడ్డి రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. మొలకలు వచ్చిన ధాన్యాన్ని రోడ్డుపై పారబోసి నిరసన తెలిపారు. ఓ రైతు రోడ్డుపై అడ్డంగా పడుకుని మొలకొచ్చిన ధాన్యాన్ని చేత పట్టుకుని పురుగుల మందు కొనియ్యండి.. తాగి సచ్చిపోతా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ శ్రీనివాసచారి, ఎస్ఐ గౌస్ అక్కడికి చేరుకొని లారీలు తెప్పిస్తామని హామీ ఇచ్చి రైతులతో రాస్తారోకో విరమింపజేశారు. - కొల్చారం